

# పుస్తక పరిచయం




**ఇంటర్నెట్‌తో పరిచయమున్న** ఎవరికైనా ర్యాండీ పాష్ అన్న పేరు తెలియకుండా ఉండదు. ఆయన కార్నెగీ మెల్లాన్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్. ఈయన మనసులోని మాటలకు అద్దం ఈ పుస్తకం. మామూలుగా చెప్పే మాటలు కాదు, తాను కొద్ది రోజుల్లో చనిపోతానని తెలిసిన వ్యక్తి చెప్పిన 'మంచి మాటలు'. ఈ లోకాన్ని విడిచివెళ్ళిపోవడం ఎప్పటికైనా తప్పదని అందరికీ తెలుసు. కానీ కొద్ది రోజుల్లో చనిపోతానని నిర్ధారణగా తెలిస్తే ఆ మనిషి మానసిక స్థితి ఎలా వుంటుంది? మామూలు మనుషుల సంగతేమో కాని ర్యాండీ పాష్ మాత్రం సాహసవంతమైన యోధుడిలా మృత్యువుతో పోరాడుతూనే తనకి జీవితం నేర్పిన పాఠాలని 'లాస్ట్ లెక్చర్' పేరుతో అందరికీ అందించాడు. 1960లో జన్మించిన ర్యాండీకి 2006 సెప్టెంబర్‌లో కాలేయంలో కాన్సర్ అని నిర్ధారించారు. అక్కడ మొదలైంది అతడి అంతిమయాత్ర. 2008 జూలై 25న కాన్సర్ మహమ్మారికి లొంగిపోయి ఈ లోకం నుంచీ నిష్క్రమించాడు. ఆ రెండేళ్ళలో లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చాడు. 'చిన్ననాటి కలల్ని సాకారం చేసుకోవడం ఎలా?' అని మొదలుపెట్టిన ప్రసంగ పరంపరకి, అతడి మరణానికి 4 నెలల ముందు పుస్తకరూపం వచ్చింది. కేవలం అమెరికాలోనే 4.5 మిలియన్ల కాపీలు అమ్ముడైన ఈ పుస్తకాన్ని ప్రపంచ వ్యాప్తంగా 46 భాషల్లోకి అనువాదం చేశారు. దీన్ని తెలుగులో అనువాదం చేసిన ప్రత్యేకత డాక్టర్ పోలంరెడ్డి శ్రీలక్ష్మి గారికి దక్కింది. హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలో చేసిన పరిశోధనకి గాను 'ఉత్తమ పరిశోధనా గ్రంథం' పురస్కారాన్ని అందుకున్న శ్రీలక్ష్మిగారు, ఈ 'ది లాస్ట్ లెక్చర్' అనే పుస్తకాన్ని అతి సరళమైన శైలిలో అనువాదం చేశారు. మూలానికి ఎక్కడా భంగం రాకుండా సూటిగా తెలుగులో వ్రాయబడిన పుస్తకాన్నే చదువుతున్నామన్న భావాన్ని కలిగించారు. రచయిత భావావేశానికి అనువాద వాక్యాలు ఏమాత్రం అడ్డంకిగా అనిపించవు. శ్రీలక్ష్మి గారి ఈ ప్రయత్నాన్ని అందరం అభినందించి తీరాలి. మృత్యువుకు లొంగిపోయిన ర్యాండీ నిజానికి మృత్యువును జయించాడు. చరమాంకంలో ఎంత స్ఫూర్తిదాయకంగా బ్రతకవచ్చో ఆచరించి చూపించాడు. ఆ భావావేశాన్ని తెలుసుకోడానికి, ర్యాండీ చెప్పిన జీవిత పాఠాలను అర్థం చేసుకుని స్ఫూర్తి పొందడానికి తప్పని సరిగా ఈ పుస్తకం చదవండి.

**

*Copies available at :*
*Navodaya Publications*
*Visalandhra Publications*
*Also directly from sreepr@gmail.com*




*Publishers:*

***Upstate Harbor Publishers***

***www.whpublisher.com***

***ISBN:978-0-615-28096-7***

**వెండితెరని తన అభినయంతో** ఏళ్ళ తరబడి సుసంపన్నం చేసిన మహానటి, తెలుగింటి ఆడపడుచు 'సావిత్రి' గురించిన సమగ్ర గ్రంథం ఈ పుస్తకం. ఆత్మకథ ఐతే ఎవరికివారు వ్రాసుకోవాలి. మరొకరి జీవిత చరిత్ర వ్రాయాలంటే ఆ వ్యక్తిగురించి ఆమూలాగ్రం పరిశోధించి, విశ్లేషించి వ్రాయాలి. మన మధ్యలేని మహానటి గురించి ఇలాంటి మహాగ్రంధాన్ని తీసుకురావాలనే ఆలోచనే ఒక ప్రత్యేకం ఐతే, దాన్ని సాధించడం ఒక యజ్ఞం. మహాయజ్ఞం లాంటి ఈ ప్రయత్నానికి ప్రతిరూపమే సావిత్రి గురించిన ఈ రిఫరెన్స్ పుస్తకం. కేవలం జీవితంలోని సంఘటనలని ఒక వరుసక్రమంలో వ్రాయడం కాకుండా 650 పేజీల ఈ ఉద్గ్రంధంలో సావిత్రి గారి జీవితాన్ని ప్రొఫెషనల్ థీసిస్ లాగా, పరిశీలన గ్రంథంలాగా చిత్రించారు. మొదటి 70-80 పేజీల్లో ఆమె జీవిత చరిత్రని వ్రాశాక మిగతా పేజీలనీ విశ్లేషణా ధోరణిలో కొనసాగిస్తూ, సావిత్రి గారి ప్రతిభని వివిధ కోణాల్లో పరిశీలించారు. ఆమె సినిమాల్లో ముఖ్యమైన వాటిలో సావిత్రి నటనని అతి సునిశితంగా పరిశీలించి గ్రంధస్థం చేయడం వెనుక రచయితలు చేసిన కృషిని అభినందించి తీరాలి. సావిత్రి వ్యక్తిత్వ విశ్లేషణని 15 విభాగాల్లో వర్ణించడం రచయితల సునిశిత పరిశీలనా దృష్టికి నిదర్శనం. ఇందులోని సమాచారాన్నంతటినీ సాధికారికంగా ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి సంపాదించారు రచయితలు. అరుదైన రిఫరెన్స్ పత్రాలు (సావిత్రి గారి జననం రిజిస్ట్రేషన్ పత్రం లాంటివి), ఫోటోలు, అత్యంత నాణ్యతతో కూడిన ముద్రణ కూడా ఈ పుస్తకాన్ని ప్రత్యేక స్థాయిలో నిలబెడతాయి. తెలుగు చలనచిత్ర మహానటి గురించి తెలుగురాని వారికి సైతం అందుబాటులో ఉండేలా ఇంగ్లీషులో వ్రాయడం ప్రయోజనాత్మకమైన ప్రయోగం. రచయితలు (పరిశోధకులు) మూర్తి గారు, సోమరాజు గారు అభినందనీయులు.

***

---

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

Editor,
KOUMUDI(Web Monthly)
4251 - Escudo Ct
Dublin - CA 94568,USA